క్లుప్తంగా

డీలర్ పోస్టుల నియామకం పారదర్శకంగా చేయాలి

పార్వతీపురంటౌన్: డీలర్ పోస్టుల నియామకం పారదర్శకంగా చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ సిఫారసులకు అవకాశం లేకుండా నిర్దేశించిన విద్యార్హత, రాత పరీక్షలో మార్కుల ఆధారంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎంతోమంది పేద అభ్యర్థులు, రాజకీయ, అర్థ బలం లేని అభ్యర్థులు దరఖాస్తు చేసి ఉన్నారని, అటువంటి వారికి అన్యాయం జరగకుండా చూడాలని ఆయన కోరారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ


మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీ పరిధిలో గల నిరుద్యోగ యువతకు వృత్తి, నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్నంలో గల నైపుణ్యాభివృద్ధి సంస్థలో ఎలక్ట్రిషియన్, టీవీ మెకానిక్, వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, ప్లంబింగ్, కార్పెంటర్, బార్బర్స్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 8వ తేదీ లోగా మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు


శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ అందజేస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో సంకల్ప్ పథకం ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు ఐదు రోజులు డొకిశీల సచివాలయంలో నిర్వహించినట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి శాఖ అధికారి కె.సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఈ ఐదు రోజులు వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పించామన్నారు. 30 మంది యువతీ యువకులకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు సర్టిఫికెట్‌లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు, నైపుణ్యాభివృద్ధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిదశ నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించాలి


కార్యక్రమానికి హాజరైన డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు

పార్వతీపురంటౌన్: విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ తిరుపతి నాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉద్యమం స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈఎండీపీ టీచర్ ట్రేటింగ్ ప్రోగాంను స్థానిక కేపీఎం హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థులకు అవసరమైన కార్యక్రమం ఇది అని చెప్పారు. పిల్లల్లో సృజనాత్మక దృక్పథం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా కృషి చేయాలని, హాజరైన ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్లుగా బెవర రామకృష్ణ, పెదప్రోలు శైలజ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉద్యమం స్వచ్ఛంద సంస్థ జిల్లా మేనేజర్ అనూష పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం


రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

పాచిపెంట: మండలంలోని మంచాడవలసలో రూ.11 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఇటీవల నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డును స్త్రీశిశుసంక్షేమ,గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రూ.75 లక్షలతో 27 సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తిచేసినట్లు తెలిపారు.పాచిపెంట మండలం పేరును పసిడిపంటగా మార్చేందుకు మండల ప్రజల ఆకాంక్ష మేరకు త్వరలో తీర్మానం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన నేరెళ్లవలస రోడ్డు

- గత ప్రభుత్వంలో ఏఎంసీ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు
- ఎన్నికలు సమీపించడంతో నిలిచిపోయినన నిధుల మంజూరు

సాలూరు రూరల్:

మండలంలోని వివాదాస్పద కొఠియా గిరిజన గ్రామాలను కలిపే నేరెళ్లవలస రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దండిగాం నుంచి నేరెళ్లవలస వరకు గతంలో వేసిన బీటీ రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతో ప్రయాణికులకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అడుగడుగునా గోతులతో వాహన దారులకు నరక యాతన పడుతున్నారు. గత ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవతో ఏఎంసీ నిధులు మంజూరుకు రూ.1.73 కోట్లతో పీఆర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు పంపించారు. కానీ ఎన్నికలు సమీపించడంతో నిధుల మంజూరు ప్రక్రియ నిలిచిపోవడంతో రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. అయితే ప్రస్తుతం వందరోజులు పండగ అంటూ కూటమి ప్రభుత్వం చాలావరకు గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతోనే పనులు చేస్తుండగా ప్రతిపాదనలు పూర్తయిన అవసరమైన ప్రధాన రహదారులపై దృష్టి సారించాల్సి ఉందని గిరిజన నాయకులు అంటున్నారు. ముఖ్యంగా నేరెళ్లవలస రోడ్డు కొఠియా గిరిజన గ్రామాల గిరిజనులు ఈ రహదారి గుండానే మైదాన ప్రాంతానికి చేరుకుంటారు. ప్రస్తుతం ఈ రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా ఉండడంతో వెంటనే నిధుల మంజూరుకు స్థానిక గిరిజన శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పూర్తిగా పాడైన నేరెళ్లవలస రోడ్డు


జనంలేక వెలవెలబోతున్న నేరెళ్లవలస వారపుసంత

వెలవెలబోయిన వారపు సంత

సాలూరు రూరల్: మండలంలో ప్రతి మంగళవారం నిర్వహించే నేరెళ్ల వలస వారపు సంత వెలవెలబోయింది. పండగ పూట వ్యాపారం బాగా సాగుతుందని ఎన్నో ఆశలతో వచ్చిన చిరు వ్యాపారులు జనం లేక నిరుత్సాహంగా ఉన్నారు. నేరెళ్లవలస సంతకు గతంలో ఏజెన్సీ ప్రాంత గిరిజనులు పెద్ద ఎత్తున వచ్చి వారికి కావాల్సిన సరుకులు కొనుగోలు చేసుకునేవారు.
అలాగే గిరిజన ఉత్పత్తులను అమ్మకాలు జరిపేవారు. ప్రస్తుతం సంతలో అలాంటి పరిస్థితి కనిపించడంలేదు. ముఖ్యంగా ఒడిశా, ఆంధ్రా సరిహద్దు గ్రామాలు కావడంతో ఒడిశాలోని సెంబులగుడ, పొట్టంగి ప్రాంతాలకు రోడ్లు పూర్తిగా వేయడంతో కొంత నేరెళ్లవలస సంతకు జనం రావడంలేదని వ్యాపారులు చెబుతున్నారు.

దళారుల చేతిలో మోసపోవద్దు

- గిరిజనులకు అండగా జీసీసీ
- మేనేజర్ రామారావు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జీసీసీ మేనేజర్ రామారావు

సాలూరు రూరల్: దళారుల చేతిలో మోసపోవద్దని గిరిజనులు సేకరించే ఉత్పత్తులను జీసీసీ మద్దతుధరతో కొంటుందని నాణ్యతతో సంబంధం లేకుండా ప్రతి ఉత్పత్తిని కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని జీసీసీ బ్రాంచ్ మేనేజర్ రామారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం నేరెళ్లవలస గ్రామంలో జీసీసీ ఆధ్వర్యంలో గిరిజన ఉత్పత్తుల కొనుగోలుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు చింతపండు గ్రేడింగ్ చేసి దళారులకు అమ్ముతున్నారని దానివల్ల వారు మీదగ్గరనుంచి మంచి చింతపండు సేకరించి పట్టణాల్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారన్నారు. అలాగే తూనికల్లో మోసాలు ఉంటాయని వాటన్నింటిని మీరు గమనించలేరని స్పష్టం చేశారు. గిరిజనులు అల్లిన చీపుర్లు పెద్దవిగా ఉంటాయని ప్రస్తుతం అంత సైజు చీపుర్లు ఎవ్వరూ వాటడం లేదన్నారు. మీరు అమ్మిన చీపురు రెండుగా చేసి దళారులు సగానికి సగం లాభపడుతున్నారని చెప్పారు. మీరు అల్లిన చీపుర్లు చిన్న సైజులో ఉంటే సరిపోతుందని, వాటిని జీసీసీ కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. మీ వద్దనుంచి వస్తువులు కొనుగోలు చేయాలంటే పీసాచట్టానికి లోబడి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇటీవల జరిగిన పీసా ఎన్నికల్లో ప్రతినిధులుగా ఎన్నికై న వారి నుంచి సర్టిఫికెట్ ఉంటేనే ఇతరులు గిరిజనుల వద్ద వస్తువులు కొనుగోలు చేసే వీలుంటుందన్నారు. అలాకాకుండా ఎవరైనా సరుకులు గిరిజనుల వద్ద కొనుగోలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీలర్లు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిడగల్లు రెవెన్యూసదస్సులో 9 అర్జీలు


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఆర్ఐ శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని భూముల సమస్యలను రెవెన్యూ సదస్సులద్వారా పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని నిడగల్లు, లక్ష్మీపురం గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు జరగ్గా రైతుల నుంచి 9 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఆర్ఐ ఎస్.శ్రీనివాస రావు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు భూములు క్రయ, విక్రయాలు దీర్ఘకాలంగా జరుగుతున్నాయని, అలాగే వంశపారంపర్యగా ధఖలుపడుతున్న భూముల (మ్యుటేషన్స్) సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్ల రీ సర్వేప్రక్రియ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామన్నారు. రైతుల సమస్యలు స్థానికంగానే పరిష్కరించాలని మార్గదర్శకాలు విడుదల చేయడం వల్ల పనులు వేగవంతంగా జరిగిపోతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాలువల్లో పూడిక తీత


జోగింపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో దోమల నివారణకు పారిశుధ్య పనులు, కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు జోగింపేటలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పెద భోగిలిలో ఎంపీడీఓ త్రివిక్రమరావు గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్యపనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పంచాయతీ రాజ్ శాఖ సమన్వయంతో పారిశుధ్యపనులు నిర్వహించాలని, కాలువల్లో పూడికలు తీయించాలని, దోమల నివారణ మందులు పిచికారీ చేయంచాలని సూచించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో పంచాయతీ సర్పంచ్‌ల పర్యవేక్షణలో వివిధ గ్రామాల్లో కార్యదర్శులు పారిశుధ్యపనులు చేపట్టాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు, గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు డుమ్మా కొట్టిన అధికారులకు షోకాజ్

సాక్షి ఎఫెక్ట్...

పాచిపెంట: జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతరు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. పీజీఆర్ఎస్‌కు హాజరుకాని మండలస్థాయి అధికారులకు కలెక్టర్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు ఎంపీడీఓ పాత్రో తెలిపారు. గైర్హాజరుకు గల కారణాలు తెలియ చేయాలని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపారు.

ఏపీఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: ఏపీఎన్‌జీఓ నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్త్రీశిశుసంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆవిష్కరించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ఏపీఎన్‌జీఓ నాయకులు మంత్రిని కలిశారు. ఆమె చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు ఆకుల ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి బాలి పద్మలత, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ముమ్మరం

భామిని: రానున్న ఆరు నెలల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేయాలని పీఆర్ అండ్ ఆర్‌డీ రాష్ట్ర కమిషనర్ ఎం.కృష్ణతేజ మంగళవారం నిర్వహించిన ఈసీలో అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈసీలో ఉపాధి ఏపీఓ ఇ.తులసీదాస్, ఈసీ వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనుల జోరు పెంచి ఫిష్ పాండ్, అమృత సరోవర్, చానల్స్, కెనాల్ లైన్ ప్లాంటేషన్, గోకులం, ఫార్మ్ పాండ్స్, కందకాలు, బెంచ్ టెర్రసింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గుమ్మలక్ష్మీపురం: జీడిమామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని, అలా చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎంఎంఎల్‌టీ వై.గణేష్‌శరత్‌చంద్ర తెలిపారు. మండలంలోని తాడికొండ రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు జీడిమామిడి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు–వాటి ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో పుల్లని మజ్జిగ ద్రావణం తయారు చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడ్డాకుల కుసుమమ్మ, వీఏఏ నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి తిరువీధి


గోదాదేవి సహిత వేణుగోపాలస్వామివారిని పల్లకీలో తిరువీధి చేస్తున్న అర్చకులు, భక్తులు

సీతానగరం:

మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీతీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వేకువ జామున గోవింద మాలలు ధరించిన భక్తులు గోదాదేవి సహిత వేణుగోపాల స్వామిని పల్లకీలో ఊరేగింపుచేశారు. ఆలయ అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు మంటపం నుంచి తీసుకువచ్చిన విగ్రహాలను పల్లకీలో అధిష్టించి భక్తులతో తిరువీధి గావించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గోదాదేవి సమేత వేణుగోపాలస్వామివారికి పూజలు చేసిన అనంతరం భక్తులందరూ నగర సంకీర్తన చేస్తూ గోవిందనామాలను పురవీధుల్లో ఆలపిస్తారన్నారు. స్వామి వారి తిరువీధి అనంతరం తిరిగి ఆలయానికి చేరుకున్న భక్తులందరూ స్వామికి పూజలు నిర్వహిస్తారన్నారు. ఈ మేరకు అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలు, పుష్పాలు, పళ్లతో ప్రత్యేక అలంకరణ చేసిన పల్లకీలో తిరువీధి చేశారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాల వితరణ చేశారు.

పక్కాగా భూముల రీసర్వే జరగాలి


ర్యాలీలో పాల్గొన్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: పక్కాగా భూముల రీ సర్వే చేపట్టాలని సబ్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం మండలంలోని గోపాలపురం గ్రామంలో రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీలో పాల్గొని రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియ, వెరిఫికేషన్ సమయంలో ఉండాల్సిన పత్రాలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. సరైన పత్రాలు లేకుండా వెబ్ ల్యాండ్‌లో పేరు మార్చవద్దని సిబ్బందికి సూచించారు.
రైతుల భూములన్నింటినీ రీ సర్వే చేయాలని ఆదేశించారు. రీ–సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, స్థానికులు, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో నిఘానేత్రాలు


సీతానగరం మార్కెట్‌లో అమరుస్తున్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల కూడళ్లతో పాటు నిరంతరం వేలాది మంది ప్రజలు, వాహనాలు తిరుగాడే మండలకేంద్రంలోని మార్కెట్‌లో క్రైం రేట్‌ను నివారించడానికి పోలీసులు అడుగడుగునా సీసీ కెమెరాలు(నిఘా నేత్రాలు) మంగళవారం అమర్చారు. మార్కెట్‌లో సీసీ కెమెరాలు అమరుస్తున్న సమయంలో ఎస్సై ఎం.రాజేష్ మాట్లాడుతూ మార్కెట్‌లో నేరాలకు పాల్పడిన వారిని, వాహనాలు చోరీకి గురైనా, ట్రాఫిక్ జామ్‌అయినా, ఎటు వంటి దుర్ఘటనలు సంభవించినా పోలీస్‌స్టేషన్‌లో ఉంటూనే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి సత్వర చర్యలు చేపట్టడానికి వీలుంటుందన్నారు. పోలీసింగ్ వ్యవస్థ పకడ్బందీగా పనిచేయడానికి సీసీ కెమెరాలు దోహద పడుతున్నాయని సర్వేలో గుర్తించామన్నారు. ఈ మేరకు దాతలు చేసిన ఆర్థిక సహాయంతో సీతానగరం మార్కెట్‌లోని ప్రధాన కూడళ్లలో 6 సీసీ కెమెరాలు, మండల కార్యాలయాల ఆవరణలో 2, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 1, చినభోగిలి జంక్షన్‌లో రెండు, లచ్చయ్యపేట జంక్షన్‌లో 2, కాశీపేట, చినభోగిలి, రైస్ మిల్లులున్న ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో బుధవారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో నిఘానేత్రాలు అమర్చడం వల్ల నిందితులను పోలీస్‌స్టేషన్‌లో ఉంటూనే గుర్తించడం, అదుపు చేయడం జరుగుతుందన్నారు.

అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ


బ్రెయిలీ చిత్ర పటానికి పూలవేసి నివాళులర్పిస్తున్న జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎం.డి గయాజుద్దీన్

పార్వతీపురంటౌన్: లూయిస్ బ్రెయిలీ అంధుల పాలిట ఆరాధ్య దైవమని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎం.డి గయాజుద్దీన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా ఆర్‌సీఎం పాఠశాల ప్రాంగణంలో బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిలీ భాషను కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఈ వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. అంధులకు ఉండే హక్కులు, వారు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి కె. కవిత మాట్లాడుతూ ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఏటా జనవరి 4న జరుపుకుంటామన్నారు. ప్రపంచవ్యాప్తంగా దృష్టిలోపంతో జీవితం గడుపుతున్న వారికి ఈ రోజు ఎంతో ప్రత్యేకమైనదన్నారు. కార్యక్రమంలో వీసీఈఏ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ, అంధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

గరుగుబిల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. మండలంలోని గొట్టివలస జంక్షన్‌లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. చాలాచోట్ల రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేని కారణంగానే ద్విచక్ర వాహనదారులు మరణిస్తుండడం బాధాకరమన్నారు. పండగ వేళ అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.
వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రతిఒక్కరూ గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సారా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శృతి, కురుపాం ఏఎస్ఐ వి.రమణలు సూచించారు. కురుపాం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మాదక ద్రవ్యాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. సెట్విజ్ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో మెలగి, ఉన్నతమైన జీవనం సాగించాలని తెలిపారు. ప్రస్తుతం యువత ఫ్యాషన్ మాయలో పడి డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఉత్తమ విద్యార్థులు, వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని, బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురికావద్దన్నారు. అనంతరం పలువురు ఉత్తమ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామ్‌గోవింద, ఉపాధ్యాయులు ఎం.జగదీష్, యస్ సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్ పాల్గొన్నారు.

సాగుపై సూచనలు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భామిని: ఇరవై నుంచి 30 సంవత్సరాలు దాటిన జీడి చెట్ల కొమ్మలు తొలగించి, మంచి దిగుబడినిచ్చే రకాల అంట్లు కట్టించి జీడి పంటలో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లోవగూడ, పోలవరంలో ఎంఏఓ కె.సింహాచలం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మలు నరికి అంటు కట్టే పద్ధతి ద్వారా వయసు మళ్లిన చెట్లు తొలగించాల్సిన అవసరం లేదన్నారు. సీతంపేట ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీరో టిల్లేజీలో మొక్కజొన్న నాటుకొనే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు దుర్గాప్రసాద్, నాగరాజు, భవాని, ఈశ్వర్, తేజ, జ్యోతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.